# కొత్త కెరటం

జి. నరసింహమూర్తి



అవతల గుమ్మం దగ్గర నిలబడి అంతా చూస్తోంది.

ఎప్పుడూ మంచం వదలని జబ్బు తండ్రిని అగుపించని శక్తి నెమ్మదిగా అక్కడకు గెంటుకొచ్చింది.

అలసటగా నీరసంగా వున్న శరీరాన్ని అలాగే నిలదొక్కుకుంటూంది సరోజ.

"చెప్పవేమే" అంటూ చెట్లుంత. కూతురు మీద విరుచుకు పడుతోంది రమణమ్మ

సంబంధాల కోసం ఊళ్ళమీద వెళ్ళిన కృష్ణారావు అప్పుడే లోనకొచ్చాడు. జరుగుతున గొడవ చూసి "ఏం జరిగింది" అని అడిగాడు.

అన్నను చూసిన వసంత లోనకు తప్పుకుంది ఏ గొడవ ముంచుకొస్తుందో నన్న భయంతో.

ఇప్పుడు సరోజ సుడిగుండంలో చిక్కుకుంది.

పొరుగు రాష్ట్రంలో ఉద్యోగం చేస్తున్నాడు కృష్ణారావు. కష్టార్జిత మంతా కూడగట్టుకొచ్చాడు చెల్లెలు పెళ్ళి చేయడానికి సెలవుమీద వచ్చాడు, కుటుంబ గౌరవాన్ని నిలపడానికి చెల్లి పెళ్ళి బాధ్యత తాను స్వీకరించాడు

తండ్రి శేషాద్రి కూతుళ్లను కన్నాడు. అంతే. తన బాధ్యతల్ని మాత్రం కొడుకు మీద పడేసి మంచమెక్కాడు.

కూతురు బెండకాయలా ముదరకముందే పెళ్ళి జరిపించాలని అన్ని ఆశలూ కొడుకు మీదే పెట్టుకుంది రమణమ్మ

చెల్లెలు సరోజ అలా కనబడుతుందేమిటి ? — అందుకే మళ్ళీ అడిగాడు కృష్ణారావు.

తల్లికి అదంతా చెప్పడానికి బెరుగ్గా ఉంది. మరోపక్క అభిమానం అడ్డొస్తుంది కాని చెప్పడం తప్పలేదు

"నువ్వు దీన్నో యింటిదాన్ని చెయ్యాలని అష్టకష్టాలూ పడుతున్నావు కృష్ణా — కాని ఇది చేస్తున్న సిగ్గుమాలిన పనులు చెప్పుకుంటే మనందరికీ తలవొంపులు."

"అసలింతకీ జరిగిందేమిటి ?"

"అడుగు — దాన్నే అడుగు — వద్దని నెత్తీ నోరూ కొట్టుకుంటున్నా కోటేశ్వరరావుగారి కూతురు రాధ పెళ్లికని ఒక్కర్తే వెళ్లిపోయింది. ఇంతక్రితమే కోటేశ్వరరావు గారి పెద్దబ్బాయి ఏదో పనిమీద ఈ ఊరొచ్చి యిలా పలకరించడానికొస్తే దీని గురించడిగాను. ఇదసలు వాళ్లింటికెళ్లనే లేదట — అయితే ఈ రెండ్రోజులూ ఎక్కడుంది ?"

కృష్ణారావు ఏదో మాయజగత్తులో మతిహీనుడ్లా నిలబడిపోయాడు తాను వింటుందేమిటి?—తన చెల్లెలు గురించేనా? అదీకూడా సరోజగురించేనా ?

పట్టుపట్టి బిక్కచచ్చిపోసయింది. తెలివైంది. చిన్నప్పటినుంచీ ఎంతో బుద్ధిగా ఉంటూంది. నేడిలా మారిపోయిందంటే నమ్మలేకుండా ఉన్నాడు.

"నిజమేనా ?"

"లేకపోతే కన్నకూతురుమీద లేనిపోనివి చెప్పకునే పాపాత్మురాలిననుకున్నావా బాబూ! అయినా దీనికిది మొదటిసారి కాదు. కాలేజీలో ఏవో ముఖ్యమైన కాగితాలుండిపోయాయని వెళ్ళి నాలుగురోజులుగ్గాని తిరిగి రాలేదు. సరే వెళ్ళింది కాని వెళ్ళింది వెళ్ళి వట్టొచ్చిందా? మెళ్ళో గొలుసు పడేసుకొచ్చింది, ఇది గొలుసు పడేసుకొచ్చిందో ఎవరికైనా యిచ్చే వచ్చిందో ఎవరికి తెలుసు ఛీ వెధవ బతుకు."

రమణమ్మ ఆగ్రహం అసహ్యంగా మారుతుంది.

ఎక్కడో ఉద్యోగం చేస్తున్న కృష్ణారావుకి ముందెన్నడూ ఇటువంటి కుటుంబ సమస్యలు వినలేదు. యవ్వనంలో ఉన్న చెల్లెలు ఇంతింత పనులు ప్రారంభించిందని ఇంతవరకూ తనకు తెలియదు

సరోజ డిగ్రీ తీసుకున్న ఓ నెలకి కాలేజీలో పనుందంటూ బయలుదేరింది. కాలేజీ కెళ్ళాలంటే పదిమైళ్ళు ప్రయాణం చేయాలి. కూతురు గడపదాటితే గుండెల్లో రాయి పడ్డట్టుంటాది తల్లికి. ఆ చదువెలాగో అయిపోనిచ్చింది వద్దు వద్దంటూనే—కాని పెళ్ళి కావలసిన పిల్ల వీధిలోకి రావడమంటే అటు రమణమ్మకీ, ఇటు తండ్రికీ బాధగానే ఉంటుంది. తల్లీ తండ్రీ వెళ్ళొద్దంటున్నా సరోజ వెళ్ళిపోయింది వెళ్ళింది నాలుగు రోజులగ్గాని తిరిగి రాలేదు.

తర్వాత కూడా కాలేజీ మీద వంకపెట్టి

# కొత్త కెరటం

వెళ్ళిందల్లా మూడు రోజులగ్గాని తిరిగి రాలేదు

ఇంటిలో ఇబ్బందుల్ని చూసిన సరోజ ఉద్యోగం చేస్తానని పట్టుపడితే, శుభ్రంగా పెళ్ళాడి సంసారం చేయడమే తమకు సంతోషమన్నారు

ఉద్యోగంలో చేరి పెళ్ళికి పంగనామాలెడుతుందన్న భయం-తమ సాంప్రదాయాలకు భిన్నంగా జరగకూడదన్నదే వాళ్ళ భావన

సరోజకి పై చదువులకెళ్ళే ఆర్థిక స్తోమత లేదు పరిస్థితుల కనుకూలంగా మారిపోవాలనుకుంది. స్త్రీకి సంఘంలో స్వాతంత్ర్యం ఉండాలంటే ఆర్థికస్వాతంత్ర్యం కోసం శ్రమించాలనుకుంది. తన ఆశయాలకు తల్లిదండ్రులు అడ్డుగోడలు ఎంత చదివించినా అంతేనని చిన్న కూతుర్నికూడా యింటిదగ్గరే కట్టేశారు. కాలం కలిసొచ్చి మొగుడొస్తే ఆమెకు విముక్తి లేకపోతే అంతే!

ఆశయాల్ని అవతలపెట్టి గృహిణి కావాలంటే కట్నం తన వ్యక్తిత్వాన్ని హేళన చేస్తుంది. కట్నంతో భర్తను కొనుక్కొని భార్యగా బతికేకంటే అసలు పెళ్ళి చేసుకోకుండా వ్యక్తిత్వం గల స్త్రీగా బతకడంలో హాయి ఉందని సరోజ ఉద్దేశ్యం.

ఆదర్శమూర్తులున్న దేశమే ఇది. కాని ఆడదాని కట్నంకాడ మాత్రంకాదు. స్త్రీ సాంఘిక విలువని కట్నంతో తూచే వ్యవస్థ మీద సరోజకు కక్ష!

కృష్ణారావు రెండు సంబంధాలు వెదికి తెచ్చాడు. కట్నం మాత్రం చుక్కలెక్కి కూర్చుంది. కట్నంమీద చుక్కలెక్కి కూర్చుంటున్నాయో చుక్కమీద కట్నం ఎక్కి కూర్చుంటుందో తెలియక కృష్ణారావు నానా తంటాలు పడ్డాడు.

సరోజ మాత్రం తనకా సంబంధాలు నచ్చలేదని బాహాటంగా చెప్పేసింది ఆ రెండు సార్లూ.

తల్లి గుండెలు బాదుకుంది. తండ్రి కూతుర్ని తిట్టుకుంటూ కాండ్రించి ఊసాడు.

జరిగిందేదో జరిగిందని నాలుగురోజులుంచి పెళ్ళికొడుకులకోసం వేటాడి వచ్చాడు కృష్ణారావు. వాళ్ళు త్వరలో పిల్లను చూసుకోడానికి వస్తామన్నారు కాని తన చెల్లెలు ఇంటిపట్టున లేకుండా ఎక్కడెక్కడో తిరిగొస్తుందని తెలిస్తే తమ పరువేంకాను? పెళ్ళికావలసిన ఇంకో అమాయకురాలుండే!

వీళ్ళకోసం తన సర్వం త్యాగం చెయ్యాలనుకుంటున్నాడు. జరుగుతున్నది మాత్రం వేరు.

చెల్లెలు సరోజ పెళ్ళంటే ఎందుకలా ఎదురు తిరుగుతుందో ఆమె తిరిగే తిరుగుళ్ళవల్ల తన కర్మమవుతూంది. దీని వెనకేదో కుళ్ళు ఉంది

ఇదేదో తేల్చిపారేయ్యాలి, ఇక సహించేది లేదనుకున్నాడు కృష్ణారావు.

"సరోజా!, ఎక్కడికెళ్ళావ్?"

సరోజ ఏమీ చెప్పలేకపోతుంది. సుడిగుండంలో కొట్టుకుంటుంది.


"మాట్లాడవే?"

"ఏం మాట్లాడుతుందిరా దీనికింతవరకూ చదువు చెప్పించి వందుకు చేస్తున్న నిర్వాకం ఇది" తల్లి ఎత్తిపొడుపు!

"అదేంటో ఇపుడు తేలిపోతుంది. చెప్పు" అంటూ ముందు కొస్తున్నాడు కోపంగా.

"నన్ను మీరంతా ఎందుకిలా బాధపెడ్తారు?" ఓర్చుకోలేక పోతుంది.

"మేమా నిన్ను బాధ పెడుతుంట?— హుఁ—నీకు పెళ్ళి చేయడానికి మేమెన్ని



A.P.S.F.
క్యాష్ సర్టిఫికెట్లు కొనండి!
రు.11లు మాత్రమే!
లక్షల బహుమతులు గెలుపొందవచ్చు!
వివరములకు,
A.P.S.F.
P.B. No. 47, RAJAHMUNDRY

WHEN NATURE FAILS
New Super Height (For Super Heightness)
HYTEX is a great name and mean tor popular people. 1 Phail (20 TABS) Rs 7 50 advance By M O 3 Phails (60 Tabs) Rs 15/ money order by advance.
M/S. VICTORIA COMMERCIAL COY.
Beat No. 1, Ambala Cantt-133001 (N.I.)
Correspond in English (AMW/2/78)

REGD
వాడండి ముఖ్యంగా అలస్యమైన.
క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన.
లేక ఆగిపోయినబహిష్టకు
SEALED PACKING 28 & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
Mfrs. SEENU & Co, MADRAS-21

74 సం.గా అఖండ ఖ్యాతిగాంచిన
నారసింహలేహ్యం
రిజిస్టర్డు ట్రేడ్ మార్కు
అన్ని రకములైన (ముఖ్యముగా పురుషుల) బలహీనతలను పోగొట్టి రక్త వృద్ధిని పుష్టిని కలిగించు వాజీకరము.
1 డబ్బా రు 7—25 పోస్టేజి ప్రత్యేకము
పి. శి. ఏ. అండ్ కో.,
పెంచేపి 523273 ప్రకాశం జిల్లా
క్యాట్లాగు ఉచితము కోరినవారికి శాంపిల్సు ఇవ్వబడును



అవస్థలు పడుతున్నామో నీకేంతెలుసు ?''

''నేను మీకు ముందు నుంచీ చెబుతున్నాను, నా పెళ్ళి విషయంలో ఎవరూ అవస్థలు పడవద్దని.''

''అంటే ?''

''అంటే ఏముందిరా బాబూ!, ఏ కులంతక్కువాడ్నో తెచ్చుకుని కొంప ముంచడానికి ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసిపోతుంటే.''

''నిజంచెప్పు'' కృష్ణారావు

''చెప్పవలసిందేమీలేదు—మీకు కులాలూ, సాంప్రదాయాలూ, వంశమర్యాదల మీదున్న అపారమైన జ్ఞానం ఆడపిల్లల అభిప్రాయాల్ని అర్థం చేసుకోవడంలో లేకపోతున్నందుకు విచారించాలి''

ఈ మాట ఛెళ్ళున తగిలింది కృష్ణారావుకి. కృష్ణారావుకే కాదు. అక్కడున్న అందరికీ.

''సరోజా! నువ్వు హద్దులు మీరుతున్నావు.''

''అలా అనుకుంటే నేనేమీ చెయలేను.''

''ఎంతైనా కట్నం యిచ్చి మంచి సంబంధం తెచ్చి నీకు పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాను''

''చాలా సంతోషం అన్నయ్యా!— కాని నీ వంటి అన్నలున్న చెల్లెళ్ళు యికనైనా సిగ్గుపడాలి.''

''సరోజా.''

''అవును. కట్నంపోసి అమ్మెయ్యాలనుకుంటున్న నీ వంటి అన్నయ్య లున్నంతవరకూ నావంటి చెల్లెళ్ల జీవితాలు సజీవ సమాధుల్లో కుమిలిపోతాయి.''

కృష్ణారావుమీంచి రైలు చక్రాలు పరుగులు తీసినట్టయింది.

''అంత అహంకారమటే నీకు, అసలు సంగతేమిటో చెప్పు'' అంటూ తండ్రి కోపంతో ఉక్కిరి బిక్కిరై ఇది భరించలేక విపరీతంగా దగ్గుతున్నాడు

''చెప్పడానికేముంది ఈ బుద్ధిమాలిన దానికి చదువు చెప్పించాము కనుక కడకు మన గొంతుక్కే తాడెయ్యడానికి తయారప్తుంది'' అంటూ తల్లి ప్రారంభించింది

''ఒకరి గొంతుకల్ని మరొకరు కోసుకునే రోజులు రాకూడదనే నా కోరిక'' అంటూ లోచనా పూర్వకంగా ఎటో చూస్తుంది.

''సరోజా!, చదువుకున్న దానివని ఇంతసేపట్నుంచీ ఓర్చుకున్నాను. అసలు నీ ఉద్దేశం ఏమిటి ?''

''ఉద్దేశ్యం — హుం — ఆడపిల్ల ఉద్దేశాలకెప్పుడైనా విలువనిచ్చారా ? - మీరే కాదు; ఈ దేశంలో ఎక్కడ చూసినా ఇంతే''

''అసలు సంగతేమిటో చెప్పు.''

''అది నీకనవసరం.''

కృష్ణారావు భగ్గున మండాడు కోపంతో ''రాక్షసీ'' అంటూ ఛరున ముందుకెళ్ళి కొట్టడానికి చెయ్యెత్తాడు

''అన్నయ్యా'' అంటూ ఆమె ప్రతిఘటిస్తూ వేసిన కేకకి కృష్ణారావు అలాగే నిలబడిపోయాడు

చెల్లెలు కళ్ళలోంచి నిప్పులు కురుస్తున్నాయి.

ఆమె సరోజలాలేదు అగ్నిశిఖలా ఉంది.

''చెయ్యిదింపు నా తోవకు అడ్డువస్తే అన్నవైనా తండ్రివైనా లెక్కచేయను. జాగ్రత్త!'' అని కారుమేఘంలా ఉరిమింది చకచకా లోనకెళ్ళిపోయింది

అంతా నిశ్చేష్టులైపోయారు.

ఒకరిముఖాలు మరొకరు చూసుకున్నారు.

కాని ఆ చూపుల్లో జీవంలేదు

అంతకుముందే బాంబు పడ్డట్టు ఆ ప్రదేశం ప్రకంపిస్తూంది.

రేపోమాపో పెళ్లిచూపుల కొస్తున్నారు, నేనేం చెయ్యనంటూ కృష్ణారావు తల్లిదండ్రులతో ఆలోచించాడు ఆ రాత్రి. ఎలాగైనా దీనిని ఎవడికో ముడిపెట్టకపోతే చేయిజారి పోవచ్చనే అనుమానం వాళ్లనందర్నీ చుట్టుకొంది.

అయిదురోజులు గడిచాయి. ఆ అయిదు రోజుల్లోనూ రెండు సంబంధాలొచ్చాయి.

కట్నాలకాడ కొచ్చేసరికి కథ అడ్డం తిరిగింది.

నేను మీ యింటికి శాశ్వతంగా చాకిరీ చేయడానికొస్తున్నాను. పైగా చదువుకున్నాను ఒప్పుకుంటే ఉద్యోగం చేస్తాను. చాలీచాలని మీ జీతాలకి మరికొంత జీతం జతచేసి సంసారం స్వర్గమయం చేస్తాను చచ్చేవరకూ పీడించే ఆర్థిక సమస్యల్లో పడి జీవితాన్ని అసహ్యించుకునే మీకో నవజీవనం చూపుతాను నన్ను పెంచడానికేగా మీరు

కట్నం తీసుకుంటుంటే, నాకొచ్చే జీతంతో బతుకుల్ని సుఖమయం చేస్తాను.

కనుక కట్నం నాకెంత ఇస్తారో తేల్చ మంది సరోజ.

వాళ్ళకి కళ్ళు తిరిగిపోయాయి.

కోమలాంగి కొత్త సిద్ధాంతం పాత సాంప్రదాయాలపై సరికొత్త యుద్ధంలా ఉంది.

నోరు మూసుకొని వెళ్ళిపోయారు.

కృష్ణారావు ఆ అవమానం భరించలేక పోయాడు. చదువుకున్నదాని సంస్కారం ఇలా వెర్రితలలేస్తుందా? — దీనికింత గర్వమా?

జుట్టు పట్టుకు లాక్కుపోయి ఏ రెండో పెళ్ళివాడి చేతనైనా పుస్తె కట్టించి దాని కళ్ళు తెరవాలనుకున్నాడు.

ఇల్లంతా గగ్గోలుగా ఉంది. తల్లీ, తండ్రీ కొడుకూ కొత్త ఆలోచనలు ప్రారంభించారు.

పెళ్ళికోసం ఉన్న భూమి, ఇల్లూ తనఖా రాస్తే వడ్డీమీద అయిదు వేలు మాత్రం ఇస్తానని వో ఆసామీ అన్నాడు. ఒకవేళ అమ్మాయిని తనకే యిచ్చి చేసినట్లయితే మూడువేలు కట్నం తీసుకొని వడ్డీ మాత్రం వదులుకుంటానన్నాడు.

ఇదికూడా బాగుందనుకున్నారు. పోయిన పెళ్ళాన్ని కిరసనాయిలు పోసి అంటించినంత మాత్రాన ఈమెను కూడా అలా చేస్తాడ నెక్కడుంది? - అందుకే ఇదే న్యాయం అనుకున్నారు.

సరోజకిదంతా తెలిసింది. అయినా ఏమీ మాట్లాడలేదు. అదేదో చూద్దాంలే అని ఊరుకుంది. అంతకంతా ప్రతిఘటించితే పెళ్ళిపీటల మీద అందరికీ కావలసిన రీతిగా సత్కారం చెయ్యాలనుకుంది.

మరో రెండ్రోజులు గడిచాయి.

సరోజ లోన గదిలో ఉంది.

బయట "టెలిగ్రాం". అంటూ సైకిల్ బెల్ మ్రోగిస్తున్నాడు పోస్టుమేన్. సరోజ విని బయట కొచ్చింది. మామూలుగా యింటికొచ్చే ఉత్తరాలన్నీ కొన్నినెలల నుంచి సరోజే అందుకుంటుంది.

తాను బయట కొచ్చేసరికి కృష్ణారావు గబగబా సంతకం చేసి టెలిగ్రాం తీసుకుంటే దానిమీద వి. సరోజ కేరాఫ్ వి. శేషాద్రి అనుంది. చెల్లెలు పేరుమీద టెలిగ్రాం రావడం కొంత ఆశ్చర్యంగానే ఉన్నా అదేమై వుంటుందోనన్న ఆరాటంతో చించి చదివాడు. మళ్ళీ చదివాడు.

అతని ముఖం తెల్లబడి పోయింది.

టెలిగ్రాంలో ఉన్న బరువు మోయలేక అతని చేతులు వణుకుతున్నట్టున్నాయి.

తల్లీ తండ్రీ కంగారుపడి అడిగారు.

"సరోజకు బ్యాంకులో ఉద్యోగం వచ్చింది."

అంతా సరోజవేపు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"ఆశ్చర్యంగా ఉందా?, నాకు ఉద్యోగం వచ్చింది. కుటుంబ గౌరవమంటూ, సాంప్రదాయాలంటూ ఆడదానికి ఉద్యోగం తగదన్నారు. నన్ను కట్టుకునేవాడి కివ్వవలసిన కట్నంకోసం అప్పులుచేసి అన్నీ లమ్ముకొని నడిరోడ్డున పడడానికే మీరు సిద్ధంగా ఉన్నారు. కాదన్నానని నామీద కక్ష కట్టారు. నాకూ ఆర్థిక స్వాతంత్ర్యం ఉందనీ, నేనూ సంపాదించగలననీ చెబితే నన్ను ఎగతాళి చేసారు. నాకు నచ్చినవాడితో పెళ్ళాడి నా బతుకును తీర్చి దిద్దుకోగలనని నే నెన్నిసార్లు చెప్పినా మీరది వినిపించుకో లేదు.

కన్న తల్లిదండ్రులైన మీరు నా వివాహ బాధ్యత అన్నమీదకు తోసేశారు. నేడు నా పెళ్ళి. రేపు చెల్లెలు వసంత పెళ్ళి. అన్న పరాయి రాష్ట్రాల్లో కష్టాలనుభవిస్తూ ఆర్జించే మొత్తమంతా చెల్లెళ్ళ కోసం ఖర్చు చేస్తూ ఉండాలి. ఇక మరో ఆధారం లేక తనఖాలమీద అప్పులు చేయాలి. చెల్లెళ్ళ పెళ్ళికోసం తన బతుకంతా కష్టాల్లో నాశనం కావాలి, ఈ దేశంలోఉన్న లక్షలాది అభాగ్యుల్లో అన్న కూడా ఒక్కడైపోవాలి. అంతేకదా! ఏం?— మాట్లాడరే?

అందుకే బతికే హక్కూ, బతకడానికి మార్గమూ స్వయంగా సంపాదించాలను కొన్నాను.

ఆడదాని నుంచి కట్నం ఆశించే మగ వాడు తిరిగి కట్నంగా ఆడదానికే ఇచ్చుకో వలసిన వ్యవస్థ వస్తే 'ఇది అన్యాయం, అక్రమం' అంటూ ఎదురుతిరగడా? అందుకే పెళ్ళిచూపులకొచ్చే ప్రబుద్ధుల్నించి నేను కట్నం కోరాను. కాని నన్నెవరూ అర్థం చేసుకోలేకపోయారు. నేనో అహం కారినని నిందించారు. కాని నిజం ఏమిటన్నది ఎవరికీ అక్కర్లేకుండా పోయింది.

కొత్తమార్గం తొక్కాను. ఉద్యోగం సంపాదించాలన్నదే ధ్యేయంగా పెట్టుకున్నాను కృషిచేసాను ఏవేవోవంకలు పెట్టి ఇంటర్వ్యూలకు వెళ్ళాను. ఖర్చుకి డబ్బు కావలసి వస్తే మెళ్ళోగొలుసు అమ్మాను.

ఆడది అబలగా పడున్నంతకాలమూ ఆమె పరిస్థితిలో మార్పురాదు తెగించాలి. తనకుతానై ముందుకు రావాలి అన్యాయానికి ఎదురు తిరగాలి. తనను తాను రక్షించుకోడానికి ప్రయత్నం చేయకుండా ఎవరో వచ్చి రక్షిస్తారనుకోవడం ఆత్మవంచన. ఆడదానికి అనాదిగా సంఘంవేసిన సంకెళ్ళు తెంచుకొని ముందుకురకాలి. అప్పుడే స్త్రీజాతికి విమోచనం.

